జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీ..మీ.. మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 29-03-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 628 పేజీలు: 4 వెల : రూ.7




## ప్రభుత్వం..

# నోట్లో మట్టి

-ప్రభుత్వానికే సవాల్‌గా మారిన వజ్రపుకొత్తూరులో మట్టి మాఫియా
-అనుమతుల్లేకుండా పంట పొలాల తవ్వకాలు...
-బహిరంగంగా కోట్లలో దందా -జేసీబీలతో పగలు పూటే దోపిడీ...
-పూండి వెంచర్లకు మట్టి తరలింపు -రైతుల భూములు గుంతలే...
-పర్యావరణానికి పెను ముప్పు -తహశీల్దార్ హెచ్చరికలు గాలికేనా?
-ఆగని అక్రమ తవ్వకాల తాండవం



వజ్రపుకొత్తూరు మండలంలో మట్టి మాఫియా దందా రోజురోజుకు రెచ్చిపోతోంది. ప్రభుత్వ నిబంధనలను, వాల్టా చట్టాలను పూర్తిగా పక్కనబెట్టి... అనుమతులు లేకుండానే పంట పొలాలను లక్ష్యంగా చేసుకుని అక్రమ తవ్వకాలు బహిరంగంగానే సాగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం కళ్లముందే ఈ దందా కొనసాగుతుండటంతో ప్రజల్లో ఆగ్రహం వెల్లువెత్తుతోంది. ముఖ్యంగా ఉద్దానం కూర్మనాథపురం, చిన్న మురహరిపురం ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారిందని పరిసర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సస్య శ్యామలమైన పంట పొలాల్లో భారీ జేసీబీలతో గుంతలు తవ్వుతూ... మట్టిని ట్రాక్టర్ల ద్వారా పూండి ప్రాంతంలోని పలు ప్రైవేట్ వెంచర్లకు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారం పూర్తిగా వ్యవస్థీకృత మాఫియా దందాగా మారిందని వారు చెబుతున్నారు. పగలు పూటే జరుగుతున్న ఈ తవ్వకాలతో కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం సాగుతోందని సమాచారం. గ్రామాల మధ్య రహదారులపై వరుసగా ట్రాక్టర్లు మట్టి మోస్తూ వెళ్లడం సాధారణంగా మారిపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రైతుల భూములు గుంతలుగా మారిపోతుండడంతో సాగుకు అనర్హంగా మారుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తవ్వకాలు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు దిగజారే ప్రమాదం, భూమి సారవంతత కోల్పోవడం, వర్షాల సమయంలో నీటి నిల్వ సమస్యలు వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారంపై వజ్రపుకొత్తూరు తహశీల్దార్ సీతారామయ్య వివరణ కోరగా"మట్టి తవ్వకాల కోసం ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని వెల్లడించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. అయితే అధికారుల హెచ్చరికలు ఉన్నప్పటికీ మట్టి మాఫియా ఎక్కడా వెనక్కి తగ్గకపోవడం అనుమానాలకు తావిస్తోంది. స్థానికులు మాత్రం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. "ఇది సాధారణ తవ్వకాల విషయం కాదు... పెద్ద ఎత్తున జరుగుతున్న మాఫియా దందా. అధికారుల సహకారం లేకుండా ఇలా బహిరంగంగా జరగదు" అని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మట్టి మాఫియాపై అధికారులు నిజంగా కఠిన చర్యలు తీసుకుంటారా? లేక యథావిధిగా ఈ దందా కొనసాగుతుందా? అన్నది ఇప్పుడు ప్రజల్లో హాట్ టాపిక్‌గా మారింది.

– పలాస

# భూములివ్వం..!

-ప్రతిపాదిత ఎయిర్‌పోర్ట్ భూసేకరణను వ్యతిరేకిస్తున్నాం
-అధికారులకు వినతులందించిన బాధిత రైతులు



**మందస, మార్చి 28(వార్త):** ప్రతిపాదిత ఎయిర్‌పోర్ట్ భూసేకరణను వ్యతిరేకిస్తున్నామని, బాధిత రైతులకు న్యాయం చేయాలని మందస మండలంలోని రాంపురం పరిధిలోని రైతులు కోరారు. భూ బాధిత రైతులు, గ్రామ ప్రజలు కలిసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సచివాలయం వీఆర్వో అందజేసిన ప్రతిపాదిత ఎయిర్‌పోర్ట్ భూమి వివరాల జాబితాకు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మందస మండల తహసీల్దార్ కార్యాలయం, పలాస ఆర్డీఓ కార్యాలయాలకు వెళ్లి తమ అభ్యంతరాలను తెలియజేస్తూ మెమోరాండం సమర్పించారు. సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి మెమోరాండం అందజేశారు. ప్రతిపాదిత జాబితా ప్రకారం సుమారు 115 మంది రైతులకు చెందిన దాదాపు 200 ఎకరాల భూమిని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అనేక కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి వస్తుందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ ఎయిర్‌పోర్ట్ భూ సేకరణ నిర్ణయాన్ని పునఃపరిశీలించి, రైతులకు న్యాయం చేయాలని వారు అధికారులను కోరారు. కార్యక్రమంలో గ్రామ భూ బాధిత రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# హేరామ్‌సాగర్

-రామ్‌సాగర్ పార్క్ పనులపై నీలి నీడలు
-స్థానిక నేతల తీరుపై ‘ పెద్దాయన’ ఆగ్రహం
-ఆకస్మికంగా నిలిచిపోయిన పనులు
- పట్టణ టీడీపీ నేతల మధ్య విభేదాలే కారణం



**సోంపేట, మార్చి 28(వార్త):** సోంపేట నుంచి విశాలమైన రామ సాగరం చెరువును ‘పల్లె పుష్కరిణి’ పథకంలో భాగంగా సుందరంగా అభివృద్ధి చేయాలన్న ఆలోచనకు ఆదిలోనే గండి పడింది. కొద్దిరోజుల క్రితమే ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ రూ.50 లక్షల అంచనా వ్యయంతో ఈ చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయం విదితమే. అంతకుముందు నుంచే ఈ పనులపై పట్టణ టీడీపీ నేతల మధ్య అభిప్రాయ భేదాలు నెలకొన్నాయి. ఒకరు అవునంటే..మరొకరు కాదంటూ రామసాగరం పనులపై ఆరంభం నుంచి ఇరు వర్గాల మధ్య అసంతృప్తి సెగలు పొడచూపిన సంగతి తెలిసిందే. కానీ ఓ వర్గం పట్టుబట్టి అధికారులను, కొంతమంది కార్యకర్తలను సమీకరించి ఇటీవల ఎమ్మెల్యేతో కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చేసినప్పటికీ ఆ వెంటనే మరో వర్గం సమస్యను పెద్దాయన దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిసింది. రామ సాగరం చెరువు దేవాదాయ శాఖ ఆధీనంలో ఉందని ఈ పనుల విషయంలో సంబంధిత శాఖ అధికారుల అనుమతులు కూడా తీసుకోలేదని, సోంపేటలో సదరు శాఖకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న నేతకు సరైన సమాచారం కూడా లేదని, ప్రస్తుత వేసవిలో ప్రజలకు, పశువులకు ఎంతో అవసరమైన సాగరంలోని నీరు పనుల పేరిట తొలగించే పరిస్థితి మంచిది కాదని ఈ విషయంలో పార్టీ నేతలు అందరూ సమన్వయంతో, ఏకభిప్రాయంతో వ్యవహరించడం లేదని కొంతమంది పెద్దాయన దృష్టికి తీసుకు వెళ్లడంతో ఇటీవల ఆయన ఇరు వర్గాలను తన ఇంటికి పిలిచి అగ్గిమీద గుగ్గిలమయ్యారని పట్టణంలో పలువురు చెప్పుకుంటున్నారు. ఈ పనుల విషయంలో పెద్దరికం వహించిన కొంత మంది అధికారులకు కూడా చురకలంటించినట్లు తెలిసింది. దీంతో అధికారులు కూడా రామసాగరం పనుల జోలికి వెళ్లకుండా ఆగిపోయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పనులు నిర్వహిస్తున్న వర్గీయులు రామసాగరం అభివృద్ధి నమూనా చిత్రాన్ని విడుదల చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. అదే మాదిరిగా అభివృద్ధి చేస్తే పట్టణ ప్రజలకు ఒక మంచి ఆహ్లాదకరమైన పార్కుగా ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పవచ్చు. ఈ విషయంలో స్థానిక నేతలు కలసికట్టుగా వెళ్లకపోవడంతో పట్టణంలో ప్రతి పనికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. నిరంతరం ఒకరిపై ఒకరు పెద్దాయన వద్ద చాడీలు చెప్పుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వడం వీరికి పరిపాటిగా మారిపోయింది. అంతకుమించి పట్టణం అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పెద్దాయనతో చర్చించిన దాఖలాలు లేవని కార్యకర్తలే బాహాటంగా పేర్కొంటున్నారు. పట్టణ టీడీపీలో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు అధికారుల వద్ద ఫిర్యాదులకు కూడా వెనుకాడడం లేదని సర్వత్ర చర్చించుకుంటున్నారు. ఈ పరిస్థితి పట్టణంలో పనిచేస్తున్న అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఇక్కడ నేతల పరిస్థితి అలా ఉంచితే రామ సాగరం విషయంలో పల్లె పుష్కరిణి పనులు ఇప్పటికే ఓవర్గం నాయకుడు కొంతవరకు చేపట్టడం జరిగింది. పట్టణంలో అభివృద్ధి కోసం ఆలోచిస్తూ పెట్టుబడికి సైతం వెనుకాడకుండా ముందుకు వచ్చి చేసినందుకు ఇటువంటి పరిస్థితులు సృష్టించడంపై సదరు నాయకుడు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పట్టణ టీడీపీలో ఇంత ఘోరమైన పరిస్థితులు నెలకొని ఉన్నప్పటికీ పెద్ద నాయకులు సమన్వయం చేసేందుకు తగు చర్యలు తీసుకోవడం లేదంటూ కార్యకర్తలు వాపోతున్నారు. ఇంతకు నీలినీడలు అలుముకున్న రామ సాగరం ప్రాజెక్టు పనులు ఇక్కడితో ఆగిపోతాయా? పెద్దల చొరవతో ముందుకు సాగుతాయా వేచి చూడాల్సి ఉంది.



# కంబిరిగాంలో భూదందా

- ప్రభుత్వ గోర్జిపై జీడీ వ్యాపారి శ్రీనివాసులు కన్ను
-జేసీబీలతో దూకుడు
-గ్రామస్తుల అడ్డగింత
- వెనక్కు తగ్గిన జీడి వ్యాపారి!
-రూ. కోటి విలువైన భూమిపై కబ్జా యత్నం... -అధికారుల మౌనం ప్రశ్నార్థకం!
-తహశీల్దార్ క్లియరెన్స్ అంటూ ప్రచారం?
-అనుమతి ఇవ్వలేదంటున్న రెవెన్యూ అధికారులు
-ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- గ్రామస్తుల ఆగ్రహ జ్వాలలు





**పలాస, మార్చి 28 (వార్త):** కంబిరిగాంలోని ప్రభుత్వ భూమిని ఓ వ్యాపారి ఆక్రమించాడనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. సర్వే నెంబర్ 34/5లో ఉన్న సుమారు 38 సెంట్ల ప్రభుత్వ గోర్జిపై స్థానికేతర జీడి పారిశ్రామికవేత్త శ్రీనివాసుడు కన్నేసి, దాన్ని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో, భారీ యంత్రాలతో పనులు ప్రారంభించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. జేసీబీతో భూమిని సవరించి గోడ కట్టడం, గ్రావెల్‌తో కప్పడం ద్వారా స్థలాన్ని పూర్తిగా ఆక్రమించుకునే ప్రయత్నం జరుగు తోందని స్థానికులు చెబుతున్నారు. దాదాపు రూ.90 లక్షల నుంచి రూ.కోటికి పైగా విలువ చేసే ఈ ప్రభుత్వ భూమిని ప్రైవేటుగా మార్చే కుట్ర జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి చర్యలను గమనించిన కేదారిపురం గ్రామస్తులు, మాజీ సైనికులు, యువత, జనసేన నాయకులు వెంటనే స్పందించి పనులను అడ్డుకున్నారు. మరోసారి భారీ యంత్రాలతో పనులు చేపట్టడంతో గ్రామస్తులు అడ్డుపడటంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామస్తుల ప్రతిఘటనకు జీడి వ్యాపారి తాత్కాలికంగా వెనక్కు తగ్గినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై ఇప్పటికే పలుమార్లు కంబిరిగాం, కేదారిపురం గ్రామాల ప్రజలు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించి ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. "ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా అధికారులు ఎందుకు చూస్తున్నారు?" అనే ప్రశ్నలు ప్రజల్లో ఉత్కంఠ రేపుతున్నాయి. ఇక ఈ వివాదం మరో మలుపు తిరిగింది. తాను చేపడు తున్న పనులకు పలాస తహశీల్దార్ నుంచి క్లియరెన్స్ ఉందని జీడి వ్యాపారి చెప్ప డం చర్చనీయాంశంగా మారింది. అయితే వీటిని ఖండించిన పలాస తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, "ఎవరికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదు... ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు" అంటూ హెచ్చరించారు. దీంతో అసలు నిజం ఏంటి? అధికారుల నిర్లక్ష్యమా? లేక దందాకు అధికార అండా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, సుమారు రూ.కోటికి పైగా విలువ చేసే ఈ ప్రభుత్వ గోర్జిని రక్షించాలని కేదారిపురం గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. "ప్రభుత్వ భూమిని కాపాడటం కోసం చివరి వరకు పోరాడతాం" అని ఆ గ్రామానికి చెందిన మాజీ సైనికుడు కే.పీ.ఆర్ స్పష్టం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు కళ్లెదుట జరుగుతున్న భూదందాపై కఠిన చర్యలు తీసుకుంటారా? లేక మరింత ఆలస్యం చేసి అక్రమాలకు అవకాశం కల్పిస్తారా? అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ విషయమై శ్రీనివాస్‌ని వివరణ కోరగా ఆ భూమికి తనకు ఎటువంటి సంబంధం లేదని, ప్రభుత్వ భూమైతే వారే స్వాధీనం చేసుకుంటారని, తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## తెలుగుజాతి ఆత్మ విశ్వాసమే 'టీడీపీ'



### నేడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**మందస, మార్చి 28(వార్త):** తెలుగుజాతి ఆత్మవిశ్వాసం తెలుగుదేశం పార్టీ అని ఆ పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. మందస మండలంలోని హరిపురంలో గల టీడీపీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దుర్యోధన మాట్లాడుతూ ఈ నెల 29న తెలుగుదేశం పార్టీ 43 వసంతాల పూర్తి చేసుకుని 44వ వసంతంలోకి అడుగుపెడుతోందన్నారు. పసుపు జెండా దేశ రాజకీయాల్లో నూతన అధ్యాయాన్ని లిఖించి, తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడిందన్నారు. ఒక సామాన్యుడిని నాయకుడిగా మలిచిన పార్టీ అని, కోట్ల మంది కార్యకర్తల గుండె చప్పుడని.. తెలుగోడి పౌరుషం.. తెలుగుదేశం అన్నారు. మందస మండలంలో ప్రతీ గ్రామంలో 28న ఉదయం 8 గంటలకు తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేసి, అనంతరం హరిపురం బాలిగాం-జంక్షన్ లో ఉదయం 9 గంటలకు, ఉదయం 10గంటలకు మందస టౌన్ లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం మందస తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని బావన దుర్యోధన కోరారు.

## నేడు హరిపురంలో

## ప్రజా విజ్ఞానసాహితీ కళావేదిక సమావేశం

**మందస, మార్చి 28(వార్త):** హరిపురంలో ప్రజావిజ్ఞానసాహితీ కళావేదిక ఏర్పాటు సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రజా విజ్ఞాన వేదిక మందస మండలం కన్వీనర్ మార్పు జగన్మోహనరావు తెలిపారు. సాహితీ అభిమానులకు, సాహితీ ప్రియులకు, సాహిత్యం రాయాలనే ఉత్సాహం ఉన్నవాళ్ళకు మంచి అవకాశం కల్పించడానికి విజ్ఞాన సాహితీ కళావేదిక ఏర్పాటు చేయాలని సంకల్పించామన్నారు. అభిమానులంతా ఈ నెల 29(ఆదివారం)న ఉదయం 9గంటలకు మందస మండలంలోని హరిపురంలో గల మార్పు ట్రస్ట్ గ్రంథాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, సభ్యులుగా చేరి, కమిటీని బలోపేతం చేయాలని ఆయన కోరారు.

## నేడు బెంతు ఒరియాల విస్తృత సమావేశం

**కంచిలి, మార్చి 28 (వార్త):** తమ కులం కోసం... తమ పిల్లల భవిష్యత్తు కోసం దశాబ్దాలుగా తప్పిస్తున్న బెంతోరియా సామాజిక వర్గీయులు తమ సమస్య పరిష్కారం కోసం చేయని ప్రయత్నం అంటూ లేదు. అందులో భాగంగానే ఇదే అంశంపై చర్చించేందుకు కంచిలి మండలం తల తంపర గ్రామంలో ఆదివారం ఉదయం 9 గంటలకు విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా బెంతోరియా సంఘం కార్యదర్శి గంగాధర సాహూ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి ఇచ్ఛాపురం నియోజకవర్గం తో పాటు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు హాజరుకావాలని కోరారు. దశాబ్దాలుగా ఏ సామాజిక వర్గము ఎదుర్కొని అత్యంత క్లిష్టమైన సమస్యను ఎదుర్కొంటున్న బెంతోరియాలు ఐక్యంగా ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నీలాపుపుట్టుగ కోలాటం బృందానికి చీరల వితరణ



**ఇచ్ఛాపురం మార్చి 28 (వార్త):** నీలాపుపుట్టుగలో కొంతకాలంగా గ్రామ మహిళలకు చిన్నారులకు, శిక్షణ ఇస్తున్న ప్రముఖ జానపద గురువు తిప్పన ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో కోలాట బృందం ఏర్పరిచి వారి బృందానికి సుమారు 50 చీరలు ఇచ్ఛాపురం ఐటీడీపీ మండల అధ్యక్షుడు,సమాజ సేవకుడు కంఠ్రేడ్ల నరేంద్ర రెడ్డి బ్రదర్స్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో కోలాట బృందానికి చీరల వితరణ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, ఆంధ్రప్రదేశ్ నాటక రంగా అకాడమీ డైరెక్టర్ దక్కత కామేష్ రెడ్డి, గ్రామ పెద్దలు హరికృష్ణ, నూకరాజు, కోలాటం బృందం ఆర్గనైజర్స్ దక్కత జయరాం, దక్కత ధర్మరాజు, దక్కత వాసు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయి ర్యాంక్



**సారవకోట, మార్చి 28 (వార్త):** పాతూరు ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థి గురుకుల ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చాడు. పాఠశాల హెచ్ఎం ఏ. యశశ్రీ తెలిపిన వివరాల ప్రకారం, మార్చి 1న నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థి ఎల్. కౌశిక్ రాష్ట్రస్థాయిలో 265వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. విద్యార్థి ప్రతిభపై ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## పెట్రోల్ బంక్ ఆకస్మిక తనిఖీ




**నరసన్నపేట, మార్చి 28 (వార్త):** నరసన్నపేటలోని కామేశ్వరి ఎంటర్‌ప్రైజెస్ పెట్రోల్ బంక్‌లో జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వినియోగదారులకు సరైన కొలతలతో ఇంధనం అందుతున్నదో లేదో తెలుసుకోవడమే ఈ తనిఖీల లక్ష్యంగా నిలిచింది. శనివారం సాయంత్రం బంక్‌ను సందర్శించిన లీగల్ మెట్రాలజీ సహాయక అధికారి చిన్నమ్మి, కొలత పరికరాలు, ఇంధన సరఫరా విధానం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో ఎలాంటి తేడాలు లేదా లోపాలు గుర్తించలేదని ఆమె తెలిపారు. అయితే నిబంధనలను ఉల్లంఘించి సరైన పద్ధతిలో అమ్మకాలు జరపని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఇంటింటా అడ్మిషన్ డ్రైవ్

### - విద్యార్థుల నమోదు పెంపుపై దృష్టి

**సారవకోట, మార్చి 28 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే దిశగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి మద్దు వెంకటరమణ సూచించారు. కొత్త విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని అడ్మిషన్ డ్రైవ్‌ను వేగవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి కిన్నెరవాడ గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన ఆయన, తల్లిదండ్రులను కలిసి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో అందుతున్న సదుపాయాలు, నాణ్యమైన బోధన గురించి వివరించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు స్పష్టం చేశారు.



# కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టిన జగన్



### -ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస, మార్చి 28 (వార్త):** అమరావతి రాజధాని కోసం రైతులు ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా భూములు త్యాగం చేశారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అసెంబ్లీలో శనివారం కొనియాడారు. గత ప్రభుత్వ దాడులను మహిళలు ధైర్యంగా ఎదుర్కొన్నారని, విశాఖ ప్రజలు కూడా అమరావతికే మొగ్గు చూపారని గుర్తుచేశారు. నాటి ప్రతిపక్ష నేతగా రాజధానికి 30 వేల ఎకరాలు ఉండాలని చెప్పిన జగన్, అధికారంలోకి వచ్చాక మాట మార్చి కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టారని మండిపడ్డారు. రాజధానిని ఒక కులానికి ఆపాదించాలని చూసిన జగన్ పాలకుడిగా పనికిరాడని నిరూపించుకున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు 70 శాతానికి పైగా ఉన్న అమరావతి, బలహీన వర్గాల అభివృద్ధికి వేదికగా నిలుస్తుందని ఆమె స్పష్టం చేశారు. అమరావతిని రాజధానిగా స్థాపించడం తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని ఆమె స్పష్టం చేశారు. చరిత్రలో ఎన్నో మార్పులు జరిగినప్పటికీ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా స్థిరమైన రాజధాని నిర్మాణం అవసరమని పేర్కొన్నారు. విభజన అనంతరం ఏర్పడిన సవాళ్లను ఎదుర్కొంటూ రాష్ట్ర అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాల్లో అమరావతి కీలకమని, ఇది అన్ని ప్రాంతాలకు సమాన అవకాశాలు కల్పించే కేంద్రంగా మారుతుందని తెలిపారు. గత ప్రభుత్వం సృష్టించిన గందరగోళాన్ని తట్టుకుని, ప్రజల ఆకాంక్షలను నిలబెట్టే దిశగా ముందుకు సాగుతున్నామని, అమరావతి ద్వారా రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు లాంటి నాయకుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నాయకత్వం వహించడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టంగా మంత్రి అభివర్ణించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానం ఒక కీలక మలుపు అన్నారు. ఇది తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే నిర్ణయం అని ఆమె పేర్కొన్నారు.

## వ్యాపార ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి



**పలాస, మార్చి 28 (వార్త):** వ్యాపార ప్రణాళికలు ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని మెప్మా పీడీ శైలజ ఆర్పీలకు సూచించారు. శనివారం పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఆమె మెప్మా సిబ్బందికి, ఆర్పీలకు, టిఎల్ ఎఫ్ ఓబిలతో మన డబ్బులు మన లెక్కలు అనే యాప్ పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మైక్రో క్రెడిట్ ప్లాన్ పైన ప్రణాళిక తయారు ఎందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఎంసీపీ ద్వారా సభ్యురాలు యొక్క వ్యాపార ప్రణాళిక ముందుగా తయారు చేయుటకు సిబ్బందికి, ఆర్పీ లకు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ లు స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం లో భాగంగా ప్రజలకు డోర్ టు డోర్ చెత్త సేకరణలో ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచనలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది సి.ఎల్.ఆర్.పి.ఎస్,ఆర్పీలు,ఖాళీ పి ఎల్ ఎఫ్ ఓబీలు, సాంకేతిక నిపుణులు బి.రాము, సిటీ మిషన్ మేనేజర్ మోహన్ రావు, ఆర్ పి లు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెత్త పోశాడని... చంపబోయాడు!

### - బిఆర్‌సి పురంలో ఓ వ్యక్తిపై

### పెట్రోల్ పోసి తగులబెట్టిన వైనం

**సోంపేట, మార్చి 28(వార్త):** ఈ మండలం బేసి రామచంద్రపురంలో శనివారం ఉదయం ఓ వ్యక్తి తనకు చెందిన స్థలంలో చెత్తాచెదారాలు పోసాడని అతనిపై మరో వ్యక్తి పెట్రోల్ పోసి తగులబెట్టి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. బారువా ఎస్సై హరిబాబు నాయుడు అందించిన సమాచారం మేరకు కీలు సీతారాములు, పొందర మోహన్ రావు కుటుంబాల మధ్య కొంతకాలంగా స్థల వివాదం నలుగుతుంది. ఈ క్రమంలో తన స్థలము అంటూ సీతారాములు కుటుంబీకులు చెత్తను తీసుకువెళ్లి వేశారు. ఇది తమకు చెందిన స్థలం అంటూ ఆగ్రహానికి గురైన మోహనరావు ఏకంగా హత్యాయత్నానికి పాల్పడ్డాడు. సీతారాములపై పెట్రోల్ పోసి తగులబెట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. సుమారు 60 శాతం వరకు శరీరం కాలిపోయిందంటూ గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసులకు సమాచారం అందిన వెంటనే ఎస్సై హరిబాబు నాయుడు సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకొని బాధితుడిని ప్రథమ చికిత్సకు బారువ సామాజిక ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం టెక్కలి ఏరియా ఆసుపత్రికి సిఫార్సు చేయగా అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. స్థానిక న్యాయమూర్తి ఇక్కడ ఆసుపత్రికి చేరుకొని బాధితుని వాంగ్మూలాన్ని సేకరించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్ కు తరలించి చికిత్స అందజేస్తున్నారు.



దీనిపై కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## సర్పంచ్‌లకు అభినందన.. సత్కారం



**జి.సిగడాం, మార్చి 28(వార్త):** ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో ఉన్న సర్పంచ్లులకు మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అభినందన సన్మాన సత్కారం శనివారం రణస్థలం క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. సర్పంచ్లుల కాలపరిమితి ముగియడంతో అభినందన సభను నిర్వహించారు.

ఈ సమావేశంలో వారు మాట్లా డుతూ ఐదు ఏళ్లుగా ప్రజా సేవాలో నిలిచి గ్రామ అభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్లు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్లు అధికారానికి కాదు, అభివృద్ధికి ప్రతీకలుగా నిలిచారని. గ్రామాల్లో చేసిన అభివృద్ధి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని, గ్రామాలను ఎంతో గొప్పగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు..ఎంత గొప్పగా చేశామంటే మన తరువాత అధికారంలోకి వచ్చిన వారు ప్రారంభోత్సవాలు చేసుకునేందుకు రెండేళ్లు సరిపడేంతలా చేశామన్నారు. ఇది ఒక చరిత్ర.. ఎచ్చెర్ల అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిపామన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, పింఛన్లు, అనే నవరత్న సంక్షేమాలు, చేశామన్నారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ జి.సిగడాం మండల పార్టీ అధ్యక్షులు డోల వెంకట రమణ, ఎంపీపీ ప్రతినిధి మండల ప్రత్యేక అహ్వానితుడు మీసాల వెంకట రమణ, జెడ్ పీటీసీ కాయల రమణ తదితర ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## సర్వేపల్లి రాధాకృష్ణన్

## విగ్రహ నిర్మాణానికి భూమిపూజ



**జలుమూరు, మార్చి 28 (వార్త):** యలమంచిలి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహ నిర్మాణానికి శనివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం రఘునాథ్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి గ్రామస్థుడు సింహాచలం ముందుకు వచ్చారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా ఈ విగ్రహాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. విగ్రహ నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలల్లో

## ఫౌండేషన్ లిటరసీ పరీక్షల నిర్వహణ



**నరసన్నపేట, మార్చి 28 (వార్త):** నరసన్నపేట మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో శనివారం జీఎఫ్ఎల్ఎన్ ఎండ్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ప్రాథమిక చదవడం, రాయడం సామర్థ్యాలను అంచనా వేయడం ఈ పరీక్షల ప్రధాన లక్ష్యంగా నిలిచింది. మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో లుకలాం, పెద్దపేట, అంపలాం, పారసెల్లి, బాలసీమ, దేవాది పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. డైట్ విద్యార్థులు, సీఆర్ఎంటీలు పరీక్షల నిర్వహణలో పాల్గొన్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలనే ఉద్దేశంతో ఈ పరీక్షలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా స్ట్రీమ్, మౌంటెన్, స్కై కేటగిరీలుగా వర్గీకరించి ఆన్లైన్‌లో నమోదు చేశారు.

## నరసన్నపేటకు స్వచ్ఛ రథం కేటాయింపు...

## చెత్త నిర్వహణపై అవగాహన

**నరసన్నపేట, మార్చి 28 (వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథాన్ని నరసన్నపేటకు కేటాయించినట్లు ఎంపీడీవో ప్రసాద్‌రావు తెలిపారు. శనివారం ఈ రథం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నట్లు ఆయన వెల్లడించారు. తడి, పొడి చెత్త వేరు చేయడం, సరైన విధంగా నిర్వహించడం పై గ్రామస్థులకు అవగాహన కల్పించడం ఈ రథం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్లాస్టిక్, ఇనప వంటి వ్యర్థాలను స్వచ్ఛ రథం వద్ద అందజేస్తే ప్రతిగా నిత్యావసర సరుకులు అందజేస్తామని చెప్పారు. గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సున్నిత అంశాలను రాజకీయం చేయవద్దు



**మందస, మార్చి 28(వార్త):** సున్నిత అంశాలను రాజకీయం చేయవద్దని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన అన్నారు. మందస మండలంలోని హరిపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భావన దుర్యోధన మాట్లాడుతూ ఇటీవల ఇచ్ఛాపురం శాసనసభ్యుడు డాక్టర్ అశోక్ బాబు జిల్లా ఎస్.టి.సంఘం ప్రతినిధులు కలసి వారి అభిప్రాయాలను తెలియజేయడం వారి హక్కు అన్నారు. కానీ ప్రజాప్రతినిధులను అవమానించే విధంగా కొంత మంది తెలియక మాట్లాడడం సరికాదన్నారు. ఇలాంటి సున్నితమైన అంశాలపై ఆచితూచి అడుగులు వేయడం మంచిదని నా అభిప్రాయమన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యే బెందాళం అశోక్ బెంతు ఒరియా సామాజికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీ వేదికగా పలుమార్లు ప్రస్తావిస్తూ, విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని, వారికి న్యాయం జరగాలని ప్రభుత్వాన్ని కోరడం అభినందనీయం. ఒక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలా.. లేదా.. అనేది వ్యక్తిగత అభిప్రాయాలతో నిర్ణయించే విషయం కాదన్నారు. వారి జీవన విధానం, సామాజిక పరిస్థితులు, చారిత్రక ఆధారాలు పరిశీలించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం చర్చలు, అవగాహన, సహనం అవసరమని.. వివాదాలు సరికాదన్నారు. ఈ విషయాన్ని కావాలనే కొందరు రాజకీయం చేస్తున్నారని గిరిజన సోదరులు గమనించాలని కోరారు.





# మందసలో ఘనంగా వెంకన్నచౌదరి జన్మదిన వేడుకలు

**-ఆలయాల్లో ప్రత్యేక పూజలు**

**-పేదలకు అన్నదానం**

**మందస, మార్చి 28(వార్త):** తెలుగుదేశం పార్టీ పలాస నియోజకవర్గం ఇన్ చార్జి యార్లగడ్డ వెంకన్న చౌదరి జన్మదిన వేడుకలు మందస మండలంలో ఘనంగా జరిగాయి.

పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీషమ్మ, భర్త నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి పేరిట ఉదయం 9.30గంటలకు మందస పట్టణంలో వాసుదేవ పెరుమాళ్ గుడిలో ప్రత్యేకంగా పూజలు జరిపారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మందస పట్టణ కమిటీ ఆధ్వర్యంలో దేవరశెట్టి మార్కండేశ్వర రావు, డిపిపాణిగ్రాహి సహకారంతో జరిగింది. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భావన దుర్యోధన, పీఏసీఎస్ చైర్మన్ లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, ముంజేటి చంద్రశేఖర్, బైరిశెట్టి గున్నయ్య, ముడుముంచి నవీన్ కుమార్ యాదవ్, జనసేన నాయకుడు సంతోష్ కుమార్ పండ, పట్టణ అధ్యక్షుడు గార కృష్ణారావు, తలగాన రాజశేఖర్ దేబాసిస్ పండా, గుంట పున్నయ్య, గుంట నారాయణరావు, గొర్లె హరీష్, సీనియర్ నాయకులు గోపీనాథ్ మహంతి, గువ్వాడ లక్ష్మీనారాయణ, జగన్నాథబెహారా కోర్నాన నాగేశ్వరరావు, సీర ఈశ్వరరావు, బర్ల హరికృష్ణ, కొర్నాన మురళి, కొత్రాయి బాలు, బురద బాలకృష్ణ, పోలాకి భాస్కరరావు, బురగాపు కిషోర్, బద్రి అప్పన్న, యాజక ఆనందు, జగదీష్ బొచ్చ ప్రకాష్, ముఖ్యఅతిథిగా మందస మండల సబ్ ఇన్స్పెక్టర్ కె.క్రిష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడికి
# సారవకోట గ్రామస్థుల అండ



**సారవకోట, మార్చి 28 (వార్త):** అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు ఎంపికైన స్థానిక నిరుపేద క్రీడాకారుడికి గ్రామస్థులు ఆర్థికంగా అండగా నిలిచిన ఉదాహరణ సారవకోటలో కనిపించింది. సారవకోట గ్రామానికి చెందిన బొద్దాన వెంకటేష్ వచ్చే నెల 24 నుంచి శ్రీలంక రాజధాని కొలంబోలో జరగనున్న అంతర్జాతీయ గోల్ షాట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీల్లో పాల్గొనడానికి సుమారు రూ.75 వేల వ్యయం అవసరమవుతుందని తెలుస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన నేపథ్యంలో గ్రామస్థులు, అలుడు, గొర్రిబంధ గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆయనకు ఆర్థిక సహాయం అందించారు. స్థానికుల సహకారంతో వెంకటేష్ అంతర్జాతీయ వేదికపై ప్రతిభ చాటాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు.

## మూలపేట పోర్ట్‌కు..
# పోదాం పదండి

**-విజయవంతం చేయాలని వైసీపీ శ్రేణులకు జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు పిలుపు**



**పలాస, మార్చి 28 (వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న గాని, ఇంతవరకు రాష్ట్ర అభివృద్ధికి శాశ్వతమైన ఒక్క అభివృద్ధి కార్యక్రమం గానీ, ప్రజా సంక్షేమానికి ఒక్క సంక్షేమ పథకంగాని చేపట్టక పోగా, గత వైయస్ఆర్సీపీ ప్రభుత్వం లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తామే చేసేమంటూ కూటమి ప్రభుత్వం పెద్దలు ముఖ్యమంత్రి చంద్ర బాబు నుంచి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో సహా క్రెడిట్ చోరీకి పాల్పడుతున్న తీరు చూస్తే హాస్యాస్పదంగా ఉందని వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. శనివారం పలాసలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీ అభివృద్ధికి అవకాశం కల్పించే అంశాలలో తీర ప్రాంతం ప్రధానమని, దానిని ఆర్థిక వనరుగా మార్చుకోవాలని, ఆలో చనతో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో 2008 జూలై 17న కృష్ణపట్నం పోర్టు ప్రారంభించారని, ఆ తర్వాత చంద్ర బాబు హయాంలో రామాయ పట్నం, బందరు పోర్టులకు శంకుస్థాపన చేసినప్పటికీ, నిర్మాణ పనులు జరగలేదన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ఒకేసారి మూడు కొత్త పోర్టులు, నిర్మాణంలో నిలిచిన మరొక పోర్టు తో పాటు 10 ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. వీటితో రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య విస్తరణకు పునాదులు పడ్డాయని బమ్మిడి దుర్యోధనరావు గుర్తు చేశారు. అందులో భాగంగా వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సుమారు రూ. 4362 కోట వ్యయశీతో మూలపేట పోర్టు నిర్మా ణాన్ని ప్రారంభించి, 70 శాతం పనులు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. వాడే ంవుల నిర్మాణమే కాక మత్స్యకారుల జీవనోపాధిని పెంపొందించేందుకు కొత్తగా పది ఫిషింగ్ హార్బర్లు మంజూరు చేసి, నిర్మాణాలు కొన్ని చేపట్టారని, ఇంతలో ఎన్నికల కోడ్ రావడం వల్ల హార్బర్ నిలిచిపోయాయని బమ్మిడి దుర్యోధనరావు పేర్కొన్నారు. పోర్టు లు నిర్మాణం అయితే వాటిని పారిశ్రామిక కారిడార్లతో అనుసంధానం చేయడం, పారి శ్రామిక అభివృద్ధి, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన, ఎగుమతుల పెంపు చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. జగన్ హయాంలో చేపట్టిన పోర్టుల నిర్మాణ పనుల వల్ల జగనన్నకు పేరు వస్తుందనే దురుద్దేశంతో చంద్రబాబు తన ప్రభుత్వంలోనే పోర్టుల అభివృద్ధి చేస్తున్నామంటూ , క్రెడిట్ చోరీకి పాల్పడుతున్న తీరు రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని బమ్మిడి దుర్యోధనరావు తెలిపారు. గతంలో హైదరాబాద్ నేనే అభివృద్ధి చేశానని, ఐటీ రంగాన్ని నేనే తెచ్చానని, హైదరాబాద్ రింగ్ రోడ్డు తానే అభివృద్ధి చేశానని, భోగాపురం ఎయిర్ పోర్ట్ నేనే నిర్మించాను అంటూ క్రెడిట్ చోరీకి పాల్పడడం చంద్రబాబు నాయుడుతో పాటు తెలుగుదేశం పార్టీ పెద్దలకు ఒక రివాజుగా మారిందని ఆయన ఆరోపించారు. రైతులు, డ్వాక్రా మహిళలు, యువత, అసంఘటిత కార్మికులు, నిరుపేద విద్యార్థులు తదితరులతోపాటు అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాల కంటే కార్పొరేట్లకు, కూటమి ప్రభుత్వ పెద్దలు, నేతల ప్రయోజనాలకే లబ్ధి చేకూరింది తప్ప, సామాన్యులకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. కేవలం రెడ్ బుక్ రాజ్యాంగం తోనే కాలక్షేపం చేస్తున్న కూటమి ప్రభుత్వం ఆచరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు బుద్ధి చెప్పేందుకు వైయస్ఆర్సీపీ ప్రజలు తరపున రాజీలేని పోరాటాలు చేస్తుందని, నిత్యం ప్రజలతో మమేకమవుతూ, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను ఎండగడుతూ, రాష్ట్ర ప్రజలను చైతన్య పరుస్తూ, ఉద్యమిస్తుందన్నారు. ఈ సందర్భంగా మూలపేట పోర్టుపై క్రెడిట్ చోరీకి పాల్పడుతున్న టిడిపికి చెందిన కేంద్రమంత్రి, రాష్ట్ర మంత్రి తోపాటు ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు, ఈనెల 30వ తేదీన సంతబొమ్మాలి మండలం మూలపేట సమీపంలో ' పోర్టుకు పోదాం పద ' అనే కార్యక్రమం వైఎస్ఆర్సిపి అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు వైసీపీ శ్రేణులు విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రులు ధర్మాన ప్రసాద్ రావు, రాష్ట్ర మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, వైయస్సార్సీపి శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్, రాష్ట్ర నేతలు, జిల్లాలో అన్ని నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు పాల్గొంటారని బమ్మిడి దుర్యోధనరావు స్పష్టం చేశారు.

## గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలి

**పోలాకి, మార్చి 28 (వార్త):** పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రాజగోపాల్ సూచించారు. శనివారం పోలాకి మండలం ప్రియాగ్రహారం పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో పాలవలస గ్రామంలో నిర్వహిస్తున్న టీకా శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా టీకాలు వేయించడం ద్వారా పశువులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, పాడి ఉత్పత్తి కూడా మెరుగుపడుతుందని వివరించారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా తమ పశు వులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారి షణ్ముఖరావు పాల్గొన్నారు.



# మహిళా వ్యాపారవేత్తలకు 'సంపన్నకారి'

**-వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు**



**మందస, మార్చి 28(వార్త):** మహిళా సంఘాలలో రెండు సంవత్సరాలు పైబడి తీసుకున్న రుణాలను సద్వినియోగ పరుచుకుని వ్యాపారం చేస్తున్న మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం తీపి కబురుగా సంపన్నకారి పథకాన్ని ప్రకటించిందని మందస వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. ప్రభుత్వం సంఘ సభ్యులలో తమ జీవనోపాధిని మెరుగుపరుచుకుని ఉమెన్ లెడ్ ఎంటర్ప్రెనర్లుగా ఉన్న మహిళలలో స్థిరమైన వ్యాపార విస్తరణకు సంబంధించి కేంద్రంలో మినిస్టర్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్, ఆజీవికా, రాష్ట్ర ప్రభుత్వం సెర్ఫ్ సంయుక్తంగా విశాఖపట్నం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ సంస్థ ద్వారా మరోమెట్టు ముందుకేసిందన్నారు. దీంతో సంపన్నకారి పథకాన్ని అమలు పరుస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే మీ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారా ? ఆదాయం సంపాదిస్తూ మార్కెట్లో మీరు మరింత అభివృద్ధి చేయాలనుకుంటే వెంటనే సంపన్నకారి కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చు అని తెలిపారు. వ్యాపారం ద్వారా వార్షిక ఆదాయం రూ.12లక్షల పైబడిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహంగా 15లక్షలు వరకు గ్రాంట్, సున్నా వడ్డీ రుణ సౌకర్యాన్ని కల్పించి, ప్రభుత్వం ఎంతో పోత్సహిస్తున్నట్లు మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. అన్ని గ్రామాలలో కూడా వెలుగు సిబ్బంది విస్తృతంగా మహిళా సంఘాలు సమావేశం ఏర్పాటు చేసుకొని, అందరికీ అర్థమైనట్లు కరపత్రాలు పంచి వివరించాలన్నారు. కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ తారక మోహన్, క్లస్టర్ కోఆర్డినేటర్లు, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

# వినూత్నంగా పాఠ్యాంశం బోధన

**-గంగిరెద్దుల జీవన విధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించిన ఉపాధ్యాయులు**



**జలుమూరు, మార్చి 28 (వార్త):** విద్యార్థులకు పాఠ్యాంశంపై మెరుగైన అవగాహన కల్పించే దిశగా, సాంప్రదాయ జీవన విధానాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా పరిచయం చేస్తూ వినూత్న బోధన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు చేపట్టిన గంగిరెద్దుల జీవన విధానాన్ని ప్రత్యక్షంగా చూపిస్తూ పాఠాన్ని బోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జలుమూరు మండలం టెక్కలిపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులను ఆకట్టుకుంది. ఇన్చార్జి హెచ్ఎం కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, ఆరో తరగతి పాఠ్యాంశంలో భాగమైన "డూ డూ బసవన్న" పాఠాన్ని బోధించేందుకు గంగిరెద్దుల వారిని పాఠశాలకు ఆహ్వానించారు. వారి జీవన విధానం, సంప్రదాయాలు, జీవనోపాధి విధానాన్ని విద్యార్థులకు కళ్లకు కట్టినట్లుగా వివరించారు. ఈ ప్రత్యక్ష బోధనతో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని, పాఠ్యాంశంపై మెరుగైన అవగాహన పొందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. వారి జీవన విధానం, సంప్రదాయాలు, జీవనోపాధి గురించి విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని పాఠాన్ని సులభంగా గ్రహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. వినూత్న బోధన పద్ధతులతో విద్యార్థుల్లో నేర్చుకునే ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు.

# మున్సిపాలిటీలో కంపోస్టు కిట్ల పంపిణీ



**ఇచ్ఛాపురం మార్చి 28 (వార్త):** పురపాలక సంఘం పరిధిలో "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో "జీరో వేస్ట్ ఇన్స్టిట్యూట్" అనే థీమ్ తో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది.

ఈ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ రమేష్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ - 2026 ను అనుసరించి, చెత్తను 4 రకాలుగా విభజించారని, అవి తడి చెత్తను పచ్చ రంగు డబ్బాలో, పొడి చెత్తను నీలం రంగు డబ్బాలో, శానిటరీ చెత్తను ఎరుపు రంగు డబ్బాలో, ప్రత్యేక జాగ్రత్త చెత్తను నలుపు రంగు డబ్బాలో వేయాలని విద్యార్థులకు సూచించారు. సిబ్బంది అందరూ తప్పనిసరిగా రోజువారి వచ్చే పొడి చెత్తతో కంపోస్టు పిట్ ను ఏర్పాటు చేసి, రోజు వారి తడి చెత్తతో ఎరువుగా చేసి కిచెన్ గార్డెన్ ను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో మెప్మ ఆర్ పి లతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం వారు మంజూరు చేసిన కంపోస్టు కిట్ లను అందజేయడం జరిగినది.

ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కుమార్ , మెప్మ టి యం సి భాస్కర్ ,సచివాలయ పర్యావరణ కార్యదర్శులు, మెప్మ సిబ్బంది పాల్గొన్నారు.

## రైలు ప్రమాదంలో యువకుడి మృతి

**- ఒడిశాకు చెందిన వ్యక్తిగా గుర్తింపు**



**నరసన్నపేట, మార్చి 28 (వార్త):** నరసన్నపేట పరిధిలో రైలు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాసరివానిపేట సమీపంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. రైల్వే హెచ్‌సీ మధుసూదన రావు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం సాయం త్రం ఆ ప్రాంతంలో మృత దేహం ఉన్నట్లు సమాచా రం అందడంతో పోలీ సులు ఘటనా స్థలానికి చేరుకుని పరి శీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కాలికట్‌కు చెందిన ఎస్బీ పాణిగ్రహి (36)గా గుర్తించారు. ప్రాథమిక విచారణలో రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడటంతో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## మానసిక వేదనతో వృద్ధురాలి ఆత్మహత్య



**జలుమూరు, మార్చి 28 (వార్త):** సురవరం గ్రామంలో మానసిక వేదనతో ఓ వృద్ధురాలు విషపదార్థం సేవించి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ బాబు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన పిట్ట దుర్గమ్మ (71) శుక్రవారం ఉదయం పేలు మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రైల్వే వంతెనపై పని చేస్తుండగా..
# రైలు ఢీకొని వెల్డర్ మృతి



**నరసన్నపేట, మార్చి 28 (వార్త):** నరసన్నపేట మండలం కామేశ్వరి పేట గ్రామం వద్ద విషాదకర ఘటన చోటుచేసుకుంది. రైల్వే వంతెనపై మరమ్మతులు చేపడుతున్న ఓ వెల్డర్‌కు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం, శుక్రవారం సాయంత్రం వంతెనపై వెల్డింగ్ పనులు నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా వచ్చిన రైలు ఢీకొనడంతో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు తిలారు గ్రామానికి చెందిన కోట అప్పారావు (29)గా గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై ఆమదాలవలస రైల్వే హెచ్‌సీ మధుసూదనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# 12.5 కిలోల గంజాయి స్వాధీనం... ఇద్దరి అరెస్టు



**నరసన్నపేట, మార్చి 28 (వార్త):** అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

నరసన్నపేట పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీఐ ఎం. శ్రీనివాసరావు, ఎస్సై గణేష్ ఈ వివరాలను వెల్లడించారు. ఒడిశాకు చెందిన అజిత్ కుమార్, గోకుల్ శక్తివెల్ అనే వ్యక్తులు శుక్రవారం రాత్రి సుమారు 12 కిలోల 550 గ్రాముల గంజాయిని బస్సులో రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు.

నిఘా చర్యల్లో భాగంగా అనుమానం కలిగిన అధికారులు తనిఖీలు నిర్వహించి ఈ అక్రమ రవాణాను వెలికితీశారు. నిందితుల వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నరసన్నపేట సమస్యలను తీర్చండి

## -లోకేష్‌ను కోరిన ఎమ్మెల్యే రమణమూర్తి



**నరసన్నపేట, మార్చి 28 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం అసెంబ్లీలో జరిగిన ఈ భేటీలో నియోజక వర్గంలో నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని ప్రస్తావించారు. అనేక పాఠశాలలు శిథిలావస్థకు చేరు కున్నాయని, వాటి పునర్నిర్మాణానికి తగిన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి నారా లోకేష్, సమస్యలను పరిశీలించి తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



**నరసన్నపేట, మార్చి 28 (వార్త):** వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చే లక్ష్యంతో నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన ప్రారంభించారు. స్థానిక ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, కళాశాల కార్యదర్శి లక్ష్మీ ప్రసన్నను ప్రశంసించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలని, వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, కళాశాల యాజమాన్యం, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్వీయ రక్షణ, రోడ్డు భద్రతపై అవగాహన




**జలుమూరు, మార్చి 28 (వార్త):** టెక్కలి సబ్‌డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో నగిరి కటకంలోని శ్రీ నారాయణ విద్యానికేతన్ పాఠశాలలో శనివారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల స్వీయ రక్షణతో పాటు సామాజిక, రోడ్డు భద్రత అంశాలపై వారికి చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా నిలిచింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ అనుకోని ఇబ్బందికర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లను ఎలా వినియోగించుకోవాలి అనే విషయాలను వివరించారు. మహిళల భద్రత (181, 1091), అత్యవసర సేవలు (112), సైబర్ మోసాలు (1930), యాంటీ డ్రగ్స్ (1972), చైల్డ్ హెల్ప్‌లైన్ (1098) వంటి నంబర్ల ప్రాధాన్యతను వివరించారు. అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి, మైనర్ల డ్రైవింగ్ నేరమని, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని సూచించారు. నేషనల్ హైవే హెల్ప్‌లైన్ నంబర్ 1033 గురించీ తెలియజేశారు. పోక్సో కేసులు, గృహహింస, బాల్య వివాహాలు, బాల కార్మిక సమస్యలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం అనంతరం పాఠశాల ఆవరణలో శక్తి టీం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టెక్కలి హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్, కోటబొమ్మాళి హెడ్ కానిస్టేబుల్ కె. గణేష్, మహిళా కానిస్టేబుళ్లు కె. రమణమ్మ, ఎం. చామంతి, పాఠశాల కరెస్పాండెంట్ బి. నారాయణరావు, ప్రిన్సిపల్ ఎం. నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ఎర్త్ అవర్




**శ్రీకాకుళం, మార్చి 28 (వార్త):** నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం పాత హౌసింగ్ బోర్డు కాలనీ లో గల నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసియా విద్యాలయ వసతి గృహంలో ఎర్త్ అవర్ కార్యక్రమం నిర్వహించారు.ప్రపంచ వ్యాప్తంగా మార్చి నెలలో చివరి శనివారం ఈ ఎర్త్ అవర్ కార్యక్రమంలో భాగంగా రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు ఒక గంటపాటు విద్యుత్ బల్బులు మరియు విద్యుత్ ఉపకరణాలను స్విఛ్ ఆఫ్ చేయాలని జిల్లా కో ఆర్డినేటర్ పూజారి గోవిందరావు తెలిపారు. భూతాపం తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించే ప్రధాన ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ పూజారి హరిప్రసన్న, ఉపాధ్యాయులు వాడాడ త్రివిక్రమ్ రావు, ఎమ్. వి. కామేశ్వరరావు, బి. రమేష్ కుమార్,బి. శ్రీకాంత్ అర్బన్ వసతి గృహ సిబ్బంది, వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.



# తాగునీటికి కట..కట



## -పది రోజులుగా కష్టాలు

## - ముద్దాడ, కిలుగు ప్రాంతాల్లో ప్రజల ఆవేదన

**నరసన్నపేట, మార్చి 28 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని ముద్దాడ, కిలుగు, జగన్నాథపురం వీధుల్లో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. సుమారు 5,000 మందికి పైగా జనాభా నివసిస్తున్న ఈ ప్రాంతాల్లో గత పది రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న వేళ తాగునీరు అందక ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారు. మోటారు పాడైందని కారణంగా నీటి సరఫరాలో ఆలస్యం జరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరమైన తాగునీరు కూడా అందకపోవడం తీవ్ర సమస్యగా మారిందని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



# వైభవంగా శ్రీరామనవరాత్రి వేడుకలు

## - సాంస్కృతిక కార్యక్రమాలకు విశేష స్పందన



**నరసన్నపేట, మార్చి 28 (వార్త):** నరసన్నపేట కొత్త బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీరామనవరాత్రి ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా కొనసాగాయి. భక్తి కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం, పట్టాభిషేక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జబర్దస్త్, డీ–జోడీ కార్యక్రమాలతో ప్రసిద్ధి చెందిన పండు తన బృందంతో కలిసి నృత్య ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులను అలరించారు. పలు పాటలకు స్టెప్పులు వేస్తూ తన ప్రతిభను చాటుకున్నారు. తన అసలు పేరు షణ్ముఖ అని, టెక్కలి మండలం నౌపడ గ్రామానికి చెందినవాడినని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. అయితే ప్రధాన రహదారిపై కార్యక్రమం నిర్వహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. జట్టు కళాసి యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలు భక్తి, వినోదం సమ్మేళనంగా కొనసాగాయి.

# మహోన్నత వ్యక్తిత్వం వెంకన్న చౌదరి సొంతం

## ఘనంగా విసి జన్మదిన వేడుకలు

పలాస, మార్చి 28 (వార్త): అతడో..ఆకాశం మహోన్నత వ్యక్తిత్వం వెంకన్న చౌదరి సొంతమని, మాటను మంత్రంలా వాడగల స్థిత ప్రజ్ఞత, ఎత్తుకు పైఎత్తులతో ప్రత్యర్థులు చిత్తు చేయగల వ్యక్తిత్వం, మాటల తూటాలకు వెరువని ధీరోధాత్తుడని, గ్లో సంస్థ పెట్టి సేవ మూర్తిని యార్లగడ్డ వెంకన్న చౌదరని రాష్ట్ర శ్రీసైన సాధికారిక కమిటీ మెంబర్ బూర్ల కృష్ణంరాజు అన్నారు. శనివారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ పిరుకోట్ల విఠల్ ఆధ్వర్యంలో పలాస నియోజకవర్గ సమన్వయకర్త, ఆపదలో ఉన్న వారి అపన్నా హస్తం, ప్రముఖ పారిశ్రామికవేత్త వెంకన్న చౌదరి జన్మదిన వేడుకలు కిస్టుపురం గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొదటనుంచి గౌతు కుటుంబానికి నమ్మిన బంటుగా, వీర అభిమానుడిగా ఉన్న , పదవి ఉన్న లేకపోయిన వీసీ మాటకి జవదాటకుండా ఆయన మంచితనం, గుణం దగ్గర నుంచి చూసిన వ్యక్తి వ్యక్తిని కృష్ణంరాజు కొనియాడారు. పుట్టినరోజు సందర్భంగా పలాస మండల పార్టీ కార్యదర్శి దువ్వాడ సంతోష్, టిడిపి నాయకులు హర్ష, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్న వారి మధ్య ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. మహిళలకు , గ్రామస్తులకు మిఠాయిలు తినిపించడమే కాకుండా ప్రజలకు ప్రాణవాయువు ఇచ్చే చెట్లను నాటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు తులసిరావు, ఉపాధ్యక్షులు ఢిల్లీ రావు, భూత్ ఇంచార్జ్ బాబురావు, యూనిట్ ఇన్చార్జ్ ఆల కృష్ణారావు, ముకుందరావు, నాగరాజు, ప్రసాదు, నాని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే ..

# పోలీసులకు సమాచారం అందించాలి

**పలాస, మార్చి 28 (వార్త):** అనుమాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి చెప్పారు. పెంటిభద్ర కూడలిలో శనివారం రాత్రి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, పేకాట వాటికి దూరంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. గ్రామంలో పోలీసులు ప్రజల్లో చైతన్యం కలిగించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత సామాజిక పరిస్థితులు, చట్టాలపై అవగాహన కల్పించడం ప్రత్యేకంగా నిలిచింది. ముఖ్యంగా మహిళా శక్తి (నారీ శక్తి) ప్రాముఖ్యతను వివరించిన పోలీసులు, మహిళలు తమ హక్కులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రజలు చట్టాలను గౌరవిస్తూ, శాంతియుత వాతావరణంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఉన్న దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద భద్రతను పెంపొందించేందుకు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పండుగలు, ఉత్సవాల సమయంలో ముందస్తుగా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం ద్వారా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని వివరించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తెలియని లింకులు క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. బెట్టింగ్, పేకాట వంటి అక్రమ కార్యకలాపాలు, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా, అమ్మకాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అత్యవసర పరిస్థితుల్లో 112 కాల్ సేవలను వినియోగించుకోవాలని గ్రామస్తులకు వివరించారు. పోలీస్ శాఖ ఎప్పుడూ ప్రజల భద్రత కోసం సిద్ధంగా ఉంటుందని, ప్రజలు కూడా చట్టపరంగా సహకరించాలని కోరారు.

### హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

ప్రతి ఒక్కరు కూడా హెల్మెట్ ధరించాల్సిందేనని, వాహనం యొక్క అన్నిపత్రాలు కలిగి ఉండాలని, మైనర్లకు వాహనం ఇవ్వకూడదని, మైనర్లకు వాహనం ఇస్తే తల్లిదండ్రులకు శిక్ష పడుతుంది అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.

Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546